నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, గురువారం 7 మార్చి 2024 | KAMAREDDY


## పెండింగ్ బిల్లులు చెల్లించాలి..

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు బుధవారం ఆందోళన నిర్వహించారు. సమస్య పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్






## సేవా కేంద్రాల్లో బారులు..

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రజాపాలన సేవా కేంద్రం వద్ద బుధవారం ప్రజలు బారులుతీరి కనిపించారు. విద్యుత్ జీరో బిల్లులు రాకపోవడంతో మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నట్లు ప్రజలు పేర్కొన్నారు. అన్ని అర్హతలు కలిగి గతంలో దరఖాస్తు ఇచ్చినా జీరో బిల్లు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.
– కామారెడ్డి, మార్చి 6

## ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలి

గంప గోవర్ధన్

కామారెడ్డి, మార్చి 6: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎల్ఆర్ఎస్ పెడితే అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు ప్రజలపై రూ.20వేల కోట్ల భారం వేస్తున్నారని దుయ్యబట్టారు. ఎలాంటి ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు రుణమాఫీ చేసిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ధర్నాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ తదితరులు

## ఉచితంగా అమలు చేసేవరకు పోరాడతాం..

ఖలీల్‌వాడి, మార్చి 6: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేపట్టాలని నగర మేయర్ నీతూకిరణ్, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 24.44లక్షల ప్రజల నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రూపేణా రూ.20వేల కోట్లు వసూలు చేసేందుకు సిద్ధమయ్యిందని ఆరోపించారు. గతంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, సీతక్క ఎల్ఆర్ఎస్ డబ్బులు కట్టొద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉచితంగా అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేసే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంట్ కోతలు మొదలయ్యాయని, రైతులు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, కార్యదర్శి ఎనుగందుల మురళి, మీర్ మజాజ్‌అలీ, ప్రభాకర్ రెడ్డి, దండు శేఖర్, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండలో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే వేముల, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు




# భగ్గుమన్న బీఆర్ఎస్

- ఉమ్మడి జిల్లాలో ఆందోళనలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డ నేతలు

**ఎల్ఆర్ఎస్‌ను** ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. బాల్కొండ మండల కేంద్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్, నిజామాబాద్ నగరంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ధర్నా నిర్వహించారు. భూముల క్రమబద్ధీకరణను ఉచితంగా చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. హామీని మరిచి ఎల్ఆర్ఎస్ ద్వారా ప్రజలపై భారం మోపాలని చూస్తున్నదని నేతలు మండిపడ్డారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలుచేసే వరకు ప్రజల తరపున ప్రభుత్వంపై పోరాడుతామని నినదించారు.

## ప్రజలపై భారం మోపొద్దు..

బాల్కొండ, మార్చి 6: ఎల్ఆర్ఎస్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో ప్లాట్‌పై లక్ష రూపాయలు వసూలు చేసేందుకు సిద్ధమయ్యిందని, దీంతో 25లక్షల మందికి నష్టం జరుగుతుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రజలపై భారం మోపకుండా ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాల్కొండ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ తీసుకొస్తే నానా యాగి చేసి, తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు ప్రజలపై రూ.20వేల కోట్ల భారం వేసేందుకు సిద్ధమయ్యారన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా వర్తింపజేసే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టంచేశారు. ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయించకుంటే సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు ఉత్తమ్, సీతక్క, కోమటిరెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇన్ని రోజులు ఓపికతో భరించామని, ప్రభుత్వ తప్పులపై నేటి నుంచి వేట మొదలైందన్నారు. మూడు నెలలైనా రైతుబంధు పడలేదని, మహాలక్ష్మి ఊసేలేదని, చేయూత పింఛన్ మరిచిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అమలు చేసింది ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటేనని, ఉచిత బస్సుతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను వేధిస్తున్న అధికారులు, పోలీసులకు తాము అధికారంలోకి రాగానే బుద్ధి చెబుతామన్నారు. కాలం ఎప్పుడు ఒకేలా ఉండదని, తమకూ టైం వస్తుందని, బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టే ప్రతిఒక్కరి పేరు రాసి పెట్టుకుంటామన్నారు. అక్రమ కేసులు పెడితే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. ధర్నా అనంతరం తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

## పంటలు ఎండిపోవద్దని ముందస్తుగా నీటి విడుదల

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

బాన్సువాడ/నిజాంసాగర్, మార్చి 6: నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతుల విజ్ఞప్తి మేరకు రిజర్వాయర్ నుంచి ముందస్తుగా నీటిని విడుదల చేయిస్తున్నట్లు మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి బుధవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆరో విడుత నీటి విడుదల ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా ఎండ తీవ్రత నేపథ్యంలో పంట పొలాలకు నీటిని విడుదల చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయకట్టు పరిధిలోని రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మరో విడుత సాగునీరు అవసరముంటే అందుకు తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. గురువారం ఉదయం నుంచి నీటి విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు.



## తెరుచుకున్న మాధవ్‌నగర్ రైల్వే గేటు

39రోజుల తర్వాత రాకపోకలు ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 6: మండలంలోని మాధవ్‌నగర్ రైల్వేలెవల్ క్రాసింగ్ గేటు తెరుచుకున్నది. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల దృష్ట్యా జనవరి 25న రైల్వే ఉన్నతాధికారులు మాధవ్‌నగర్ గేటును మూసివేశారు. 39రోజుల తర్వాత బుధవారం మధ్యాహ్నం రైల్వే గేటు నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. రాకపోకలు సాఫీగా జరిగేందుకు గేటుకు ఇరువైపులా రైల్వే అధికారులు బీటీ రోడ్డును వేశారు.



**తాగునీటి కష్టాలు** ప్రారంభమయ్యాయి. వేసవి ప్రారంభంలోనే తాగునీటి కటకట తీవ్రమవుతున్నది. గుక్కెడు మంచినీరు కోసం జనం నానాపాట్లు పడుతున్నారు. ఇక ఏప్రిల్, మే నెలల్లో నీటి ఎద్దడిని ఎలా ఎదుర్కోవాలన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.
– కోటగిరి, మార్చి 6



నాచుపల్లితండాలో వ్యవసాయ బోరుబావి వద్ద నీళ్లు పట్టుకుంటున్న గిరిజనులు

## విద్యార్థి హత్యకేసులో ఏడుగురు నిందితుల రిమాండ్

శక్కర్‌నగర్, మార్చి 6: బోధన్ పట్టణంలోని బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో డిగ్రీ విద్యార్థి హరియాలి వెంకట్ మృతికి కారకులైన ఏడుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. ఈ ఘటనలో నలుగురు మేజర్లను రిమాండ్‌కు, మరో ముగ్గురు మైనర్లను జువైనల్ హోంకు తరలించినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

## ఇద్దరిపై మాల్‌ప్రాక్టీస్ కేసు..

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, మార్చి 6: ఉమ్మడి జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన ఫస్టియర్ పరీక్షల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల కళాశాలలో ఒకరు, వర్ని మండలంలోని మాడల్ స్కూల్‌లో మరొకరు మాస్ కాపీయింగ్ చేస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. మొత్తం 17,229 మంది విద్యార్థులకు 16,602 మంది హాజరుకాగా, 627 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 45 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. కామారెడ్డిలో ఫస్టియర్ జనరల్ విభాగంలో 6316మందికి 6103 మంది విద్యార్థులు హాజరుకాగా, 213 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్‌లో 1569కి 1435 మంది హాజరుకాగా 134 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

## ఆర్మూర్ ఇన్‌చార్జి చైర్మన్‌గా మున్నా

ఆర్మూర్‌టౌన్, మార్చి 6: ఆర్మూర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్ షేక్ మున్నా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బల్దియా బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉండడంతో సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. చైర్‌పర్సన్ పండిత్ వినీతపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం అనేక మలుపులు తీసుకున్న సంగతి తెలిసిందే. అవిశ్వాసం నెగ్గిందని ఒకసారి, వీగిందని మరోసారి అధికారులు ప్రకటించడం కొత్త సంక్షోభానికి దారితీసింది. అవిశ్వాస ప్రక్రియలో సాంకేతిక అంశాలను చూపి ఎవరికి వారు పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు యత్నించారు. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో దాదాపు రెండు నెలలుగా బల్దియాకు బాస్ లేకుండా పోయారు. అయితే బడ్జెట్ సమావేశా లు నిర్వహించాల్సి ఉండడంతో మేల్కొన్న ప్రభుత్వం తాజాగా మున్నాను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించింది.

# తాగునీటికి తండ్లాట

అధికారుల నిర్లక్ష్యం.. గొంతెండుతున్న పల్లెలు

ఎండాకాలం ఆరంభంలోనే కన్నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. నిజామాబాద్ జిల్లాలోని పలు గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య షురూ అయ్యింది. కోటగిరి మండలం నాచుపల్లి తండాలో ప్రజలు తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. కానీ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల్లో తాగునీటి కష్టాలపై దృష్టి సారించలేకపోయిందని ప్రజలు వాపోతున్నారు. నాచుపల్లి తండాలో వారంరోజుల క్రితం బోరుమోటార్ పాడైపోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం నానాకష్టాలు పడుతున్నారు. ప్రతి రోజూ ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకొని గొంతు తడుపుకుంటున్నామని గిరిజనులు చెబుతున్నారు.

**బోరు బావులే దిక్కు..**

గ్రామంలో తాగునీటి కోసం రూ.లక్షలు వెచ్చించి నీటి ట్యాంకులు నిర్మించినా.. అవి ఏ మాత్రం ఉపయోగపడడం లేదు. అధికారులు మిషన్ భగీరథ నీరు అందిస్తామని చెప్పినా ఇంటింటికీ రావడం లేదు. ఒకవేళ వచ్చిన వారానికోసారి, మూడు రోజులకోసారి వస్తాయని, అది కూడా అరగంట మాత్రమేనని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రతిరోజూ మిషన్ భగీరథ నీరు వస్తే వాటిని పట్టుకుంటామని గిరిజనులు అంటున్నారు. మూడు రోజులకోసారి సరఫరా చేయడంతో నీటిలో పురుగులు వస్తున్నాయని పేర్కొంటున్నారు.

- నాలుగురోజులకోసారి మిషన్ భగీరథ నీరు
- వ్యవసాయ బోరుబావుల నుంచి తెచ్చుకుంటున్న గిరిజనులు
- నాచుపల్లి తండాలో నీటి ఎద్దడి

**పట్టించుకోని అధికారులు..**

నాచుపల్లి తండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నదని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తండాలో ఉన్న బోరు వారం రోజుల క్రితం పాడైపోయిందని, సమాచారం ఇచ్చినా మరమ్మతులు చేయించడం లేదని తండావాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయమై కోటగిరి ఎంపీడీవో మనోహర్‌రెడ్డిని వివరణ కోరగా.. నాచుపల్లితండాలో ఉన్న బోరు పాడైందని వెంటనే కార్యదర్శితో మాట్లాడి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

**పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం..**



మాది కోటగిరి మండలం నాచుపల్లి తండా. గత ప్రభుత్వ హయాంలో తాగునీటి సమస్య ఎన్నడూ రాలేదు. గిప్పుడు తాగునీటి కోసం నానా కష్టమవుతున్నది. తండాలో ఉన్న బోరు పాడైంది. దానిని రిపేర్ చేస్తలేరు. పొద్దున లేవగానే పొలాల కాడికి పోయి నీళ్లు తెచ్చుకుంటున్నాం.
**– దూరిబాయి, నాచుపల్లితండా, కోటగిరి**

**తాగడానికి నీళ్లు దొరకడం లేదు..**



నాచుపల్లితండాలో తాగునీరు దొరకడం లేదు. బోరు పాడైపోయి వారం రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రిపేర్ చేస్తలేరు. రోజూ పొద్దున నీటి కష్టాలు తప్పడం లేదు. పశువులకు కూడా తాగడానికి నీళ్లు దొరకడం లేదు. అధికారులు స్పందించి తండాలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి.
**– హీరిబాయి, నాచుపల్లితండా, కోటగిరి**

## రైతునేస్తాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రైతునేస్తం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

డిచ్‌పల్లి, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మె ల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి సూచించారు. రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను అనుసంధానం చేస్తూ 'రైతునేస్తం' పేరిట సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మం తు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొని మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రతి మంగళ, శుక్రవారం నాడు నిష్ణాతులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులను సంప్రదించి రైతులు తమ సమస్యలను పరిష్కరించుకునే వెసులుబాటు ఏర్పడిందన్నారు. వచ్చే వానకాలం నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జగన్నాథచారి, ఏవో రాంబాబు, ఏఈవోలు పాల్గొన్నారు.





